
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 20 మార్చి 2024



ఆనందపురంలో మట్టి దందా!
- కొండలపై అడ్డగోలుగా తవ్వకాలు
- వందల లోడ్ల మట్టి, గ్రావెల్ విక్రయం
- రూ.కోట్లలో ఆర్జించిన అక్రమార్కుడు
- ఉన్నతాధికారి బంధువునంటూ బెదిరింపులు

- వార్త I పేజీలో



శిలాఫలకంతో సరిపెట్టేశారు!



కార్యరూపం దాల్చని బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"విశాఖకు పర్యాటకంగా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. అందుకోసమే బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ఈ ప్రాజెక్టుతో ఆర్కే బీచ్ స్వరూపమే మారిపోతుంది. ప్రపంచస్థాయి సదుపాయాలతో పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి
(2019 డిసెంబరు 28న సిటీ సెంట్రల్ పార్కు వద్ద బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా...)



ఆర్కేబీచ్‌లో కోతకు గురైన ఇసుకతెన్నెలు



- నాలుగున్నరేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- విశాఖ స్వరూపమే మారిపోతుందంటూ కబుర్లు
- రూ.250 కోట్ల వ్యయం అవుతుందని అంచనా
- తొలిదశ పనులకు రూ.116 కోట్లతో టెండర్లు ఆహ్వానం
- కాంట్రాక్టు దక్కించుకున్న హైదరాబాద్ సంస్థలు
- అడ్వాన్స్ విడుదల చేయకపోవడంతో అగ్రిమెంట్ కూడా చేసుకోకుండానే వెనక్కి...

...అయితే నాలుగున్నరేళ్లు గడిచిపోయినా ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలపై చేతులెత్తేయడంతో టెండరు దక్కించుకున్న సంస్థ అగ్రిమెంట్ చేసుకోకుండానే వెనుతిరిగిపోయింది.

విశాఖ అనగానే ఎవరికైనా ఆర్కే బీచ్ గుర్తుకొస్తుంది. అటువంటి బీచ్ హుద్‌హుద్ కారణంగా కొంత దెబ్బతింది. అలల ఉధృతికి కోతకు గురైంది. బీచ్‌ను ఆనుకుని ఉన్న పార్కుల ప్రహరీ గోడలు సైతం కోత కారణంగా కూలిపోయాయి. ఈ నేపథ్యంలో విపత్తులు వంటివి సంభవించినా ఎలాంటి నష్టం జరగకుండా బీచ్ ఫ్రంట్‌ను రీడెవలప్ చేయడంతోపాటు సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ప్రపంచస్థాయి వసతులను సమకూర్చడం లక్ష్యంగా ఏపీ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు (ఏపీడీఆర్‌పీ) పేరుతో బీచ్‌ఫ్రంట్ రీడెవలప్‌మెంట్‌కు వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కొంత వాటా సమకూర్చేలా డీపీఆర్‌ను తయారుచేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకూ 3.5 కిలోమీటర్లు బీచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు పొడవున బీచ్‌లో రక్షణ గోడ నిర్మాణం, సైక్లింగ్ ట్రాక్, 1.8 మీటర్లు వెడల్పున మూడు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ఐదుచోట్ల ప్రజా మరుగుదొడ్లు, ఎనిమిదిచోట్ల తాగునీటి సదుపాయం, పర్యాటకులకు స్థానిక ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం ఉన్న దుకాణాలను చిన్నపాటి మాల్స్‌గా అభివృద్ధి చేయడం, పిల్లలు, పెద్దలకు వేర్వేరు సదుపాయాలతో రిక్రియేషన్ పార్కులు, బీచ్‌లోకి సురక్షితంగా వెళ్లి వచ్చేలా ఎంపిక చేసిన చోట ప్రత్యేక మార్గాలు నిర్మాణం, సర్వీస్ రోడ్లు అభివృద్ధి, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఆకర్షణీయంగా బస్‌బేలు, పర్యాటకులకు వసతి, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా ల్యాండ్ స్కేపింగ్, సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ విదేశాల్లో జరిగే ప్రత్యేక వేడుకలను ప్రత్యక్షంగా సందర్శకులు వీక్షించేందుకు వీలుగా యాంపీ థియేటర్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ఇందుకోసం రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఒకేసారి కాకుండా నాలుగు దశల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు జీవీఎంసీ అధికారులు తొలిదశ పనుల కోసం రూ.110 కోట్లతో 2019లో టెండర్ పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, ఎస్‌పీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థతో కలిసి రూ.116 కోట్లకు (రూ.ఆరు కోట్లు అధికం) టెండరు దక్కించుకుంది. నెలరోజులపాటు బీచ్ వెంబడి సర్వే నిర్వహించి అక్కడున్న పరిస్థితులను గుర్తించి, తర్వాత 17 నెలల్లోగా ప్రాజెక్టును

... మిగతా 6వ పేజీలో

అదనపు షాక్



వినియోగదారులపై ఈపీడీసీఎల్ దొంగదెబ్బ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులు ఆదాయం పెంచుకోవడానికి వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. గతంలో ఒకసారి అదనపు లోడ్ అంటూ నోటీసులు ఇచ్చి కొద్దిపాటి మొత్తాలు వసూలు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే బాటలో వెళుతూ నోటీసులు ఇస్తున్నారు.

- 250 యూనిట్లలోపు వినియోగిస్తున్న వారికి నోటీసులు
- ఎక్కువ లోడ్ పడుతున్నందున అర్జెంట్‌గా రూ.4,450 కట్టాలని ఆదేశం
- నెలాఖరులోగా చెల్లించకపోతే కనెక్షన్ కట్ అంటూ హెచ్చరికలు

ఈపీడీసీఎల్ సిబ్బంది కొద్ది రోజులుగా నెలకు 75 యూనిట్ల నుంచి 250 యూనిట్ల మధ్య వినియోగించే వారి ఇళ్లకు వెళ్లి ఏయే విద్యుత్ పరికరాలు వినియోగిస్తున్నారో పరిశీలిస్తున్నారు. ఒక కిలోవాట్ కోసం విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ లోడ్ వాడుతున్నారని చెబుతున్నారు. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు ఏసీ, వాషింగ్ మెషిన్ వంటివి చూపించలేదని, ఇప్పుడు అవన్నీ వినియోగిస్తున్నందున ఎక్కువ లోడ్ పడుతోందని, అందుకు తగిన మొత్తాలు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆ తరువాత రెండు రోజులకు ఒక నోటీసు పంపుతున్నారు. ఒక కిలోవాట్‌కు బదులు మూడు కిలోవాట్లు వాడుతున్నందున, అదనంగా రెండు కిలోవాట్లకు సర్వీస్, డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, అప్లికేషన్ ఫీజుతో పాటు జీఎస్టీ చెల్లించాలని అంటున్నారు. మొత్తం రూ.4,459 కట్టాలని డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. అందులో రూ.4 వేలు అచ్చం డెవలప్‌మెంట్ చార్జీల కింద చూపిస్తున్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.400, అప్లికేషన్ ఫీజు రూ.50, జీఎస్టీగా రూ.9 వేసి మొత్తం రూ.4,459 నెలాఖరులోగా చెల్లించాలని ఆదేశిస్తున్నారు. అలా చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని, ఆ మొత్తం చెల్లించాకే పునరుద్ధరిస్తామని అంటున్నారు. ఇలా ఒక్క జోన్-3 లోనే రెండు వేల మందికి నోటీసులు జారీచేశారు. అలాగే జోన్-2, జోన్-1లో కూడా వేలాది మందికి ఈ నోటీసులు ఇస్తున్నారు. వీరంతా మధ్య తరగతివారే కావడం గమనార్హం.

క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందే

- ఈపీడీసీఎల్ జోనల్ అధికారి

అదనపు లోడు విషయాన్ని ఈపీడీసీఎల్ ... మిగతా 6వ పేజీలో

నెరవేరని రెగ్యులరైజ్ హామీ

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల ఆవేదన



- అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తానంటూ పాదయాత్రలో జగన్ హామీ
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత పట్టించుకోని వైనం
- రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,200 మంది

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):

"అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేస్తాం. కాంట్రాక్టు ఉద్యోగులకు అండగా ఉంటాం"

..ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నాహామీ అమలు దిశగా ఆలోచన చేయలేదు. దీనిపట్ల కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెగ్యులర్ చేస్తారని ఆశగా ఎదురుచూశామని, కానీ మాట నిలబెట్టుకోలేదని ఆరోపిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 11,500 మంది, ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 1,200 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులున్నారు. వీరంతా కేజీహెచ్, విమ్స్, ఘోషా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధులు, మానసిక ఆస్పత్రితోపాటు ఏరియా ఆస్పత్రుల్లో గడిచిన 14 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. ప్రతిపక్ష నేతగా అనేక సభల్లో రెగ్యులరైజ్ చేస్తామంటూ జగన్ హామీ ఇచ్చారని, ఐదేళ్లు పూర్తయినా ఇచ్చిన హామీని అమలు చేయలేదని...కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులరైజ్ చేయడం వల్ల ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం స్టాఫ్ నర్సులను మూడు విభాగాలుగా విభజించి

... మిగతా 6వ పేజీలో

బార్‌ల ఇష్టారాజ్యం

- నిర్దేశిత సమయం తరువాత కూడా అమ్మకాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు
- రుషికొండలో రెండు బార్‌లపై కేసు నమోదు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో బార్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లోనే విక్రయాలు జరపాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోలీసులు బార్‌లపై నిఘా పెట్టడంతో ఉల్లంఘనలు బయటపడుతున్నాయి. జిల్లాలో 118 బార్‌లు ఉన్నాయి. వీటిలో ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల మధ్య మద్యం విక్రయాలు జరపాలి. కానీ బార్‌ల నిర్వాహకులు ఆ నిబంధనను పాటించడం లేదు. తెల్లవారుజాము నుంచి అర్థరాత్రి దాటిన తర్వాత కూడా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. బార్‌లు 11 గంటలకల్లా మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అయితే నగర పరిధిలోని రుషికొండ ప్రాంతంలో గల రెండు బార్‌లు 24 గంటలు మద్యం విక్రయిస్తున్నట్టు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసులు సోమవారం అర్థరాత్రి 12 గంటలకు ఆ బార్‌ల వద్దకు వెళ్లగా...

... మిగతా 6వ పేజీలో

నిధులు లేవు విధులు

అలంకార ప్రాయంగా బీసీ కార్పొరేషన్ ఛైర్మన్/డైరెక్టర్ పదవులు

- గడిచిన నాలుగేళ్లలో రూపాయి కూడా విదల్చని సర్కారు
- ఒక్క పనీ కాలేదని వాపోతున్న నేతలు
- పైగా చేతిచమురు వదిలిందని ఆవేదన

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు లేని విభాగాలు, విధులు లేని పదవులు పెరిగాయి. ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఈ తరహా పదవులు అధికమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం 139 బీసీ కులాలకు కొత్తగా 56 కార్పొరేషన్లను ఏర్పాటుచేసింది. ఒక్కో కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను, 13 మంది డైరెక్టర్లను నియమించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 60 మందికి ఛైర్మన్లు/డైరెక్టర్లు పదవులు దక్కాయి. వీరంతా గడిచిన నాలుగేళ్ల నుంచి పదవుల్లో ఉన్నారు. మరో ఏడాదిలో వీరి పదవీ కాలం ముగియనుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే పదవీ కాలంలో ఏం చేశామన్న విషయాన్ని కూడా చెప్పుకోలేని స్థితిలో సదరు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఒక్క కాపు కార్పొరేషన్‌కు మినహా ఏ కార్పొరేషన్‌కూ ఒక్క రూపాయి విడుదల చేయలేదు. పదవులు వచ్చాయని చెప్పుకోవడం తప్పితే...ఒక్క పని చేయించుకోలేకపోయామని పలువురు ఛైర్మన్లు/డైరెక్టర్లు వాపోతున్నారు.

సిఫార్సులతో చేయొచ్చని ఆశపడి

రాష్ట్ర స్థాయి పదవులు కాబట్టి పలుకుబడి ఉంటుందని నేతలు భావించారు. కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తే...తమ అనుయాయులకు, కార్యకర్తలకు కొంతలో కొంతైనా మేలు చేయవచ్చుననే ఆలోచన చేశారు. అందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి అవకాశమే లేకుండా చేశారు. కార్పొరేషన్లకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌కు ఛైర్మన్, డైరెక్టర్‌గా చేసి తమకు ఏం లబ్ధి చేకూర్చారని ఎవరైనా అడిగితే ఏం చెప్పాలో కూడా తెలియడం లేదంటూ పలువురు వాపోతున్నారు.

చేతి చమురు వదిలి

ఛైర్మన్లు, డైరెక్టర్లుగా నియమితులైన ఎంతోమంది నేతలకు చేతి చమురు వదిలిపోయింది. ప్రభుత్వం నుంచి నిధులు లేకపోగా

... మిగతా 6వ పేజీలో

పబ్లిక్ స్థలాల్లో రాజకీయ ప్రకటనలకు అనుమతి లేదు : ఈసీ - వార్త I పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.11
సహరి (గురు)	4.45

ఈపీడీసీఎల్‌లో రెవెన్యూ టార్గెట్స్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

- నెలాఖరుకల్లా వంద శాతం వసూలు చేయాలని ఆదేశాలు
- వాణిజ్య వినియోగదారుల చుట్టూ చక్కర్లు కొడుతున్న ఇంజనీర్లు
- గడువుకు ముందే చెల్లించాలని వేడుకోలు

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు'గా మారింది విద్యుత్ శాఖ ఇంజనీర్ల పరిస్థితి. ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) నెలాఖరుకు 100 శాతం బిల్లులను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిని వసూలు చేయాల్సిన బాధ్యత ఇంజనీర్లకు అప్పగించింది. విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్లు, ఫిర్యాదుల పరిష్కారం చూడాల్సిన అధికారులంతా ఇప్పుడు బిల్లులను సకాలంలో కట్టించే పనిలో పడాల్సి వచ్చింది. సంస్థ పనితీరు మెరుగుపరుచుకోవడానికి అమలు చేస్తున్న సరికొత్త నిబంధనల్లో వంద శాతం రెవెన్యూ వసూళ్లు కూడా చేర్చడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

సంస్థ పరిధిలో ప్రతి నెలా పదో తేదీలోగా బిల్లింగ్ మొత్తం జరిగిపోయేలా ఏర్పాట్లు చేశారు. ఇంతకు ముందు ఇది 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగేది. బిల్లులు ఇవ్వడం ఆలస్యమైతే... వసూళ్లు కూడా ఆలస్యం అవుతాయని భావించి, ఎట్టి పరిస్థితుల్లోను పదో తేదీలోగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో 12వ తేదీ వరకు సమయం ఇస్తున్నారు. బిల్లు జారీ చేసిన తరువాత దానిని చెల్లించడానికి వినియోగదారులకు 15 రోజులు గడువు ఉంటుంది. కొంత మంది సకాలంలో చెల్లిస్తారు. కొందరు జరిమానాతో తరువాత నెల కడుతుంటారు. ఇలాంటి జాప్యం లేకుండా ఏ నెలలో జారీ చేసిన బిల్లులు ఆ నెలాఖరులోగా వసూలయ్యేలా చూడాలని ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించారు. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి పెద్ద మొత్తాలు రావని భావించిన అధికారులు వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులను ఆశ్రయిస్తున్నారు. ప్రింటింగ్ ప్రెస్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న తరహా పరిశ్రమలు, ఐటీ కంపెనీల ప్రతినిధుల వద్దకు వెళ్లి ఏమాత్రం ఆలస్యం లేకుండా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ఈపీడీసీఎల్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు

... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటు రిటైర్డు ఉద్యోగులకు ఇంకా అందని పెన్షన్లు!

- పింఛన్ కోసం సగటున రూ.50 లక్షలు డిపాజిట్

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు రిటైర్డు ఉద్యోగులకు ఈ నెల 19వ తేదీ వచ్చినా ఇంకా పెన్షన్లు ఇవ్వలేదు. స్టీల్‌ప్లాంటులో పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులు, విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబీకులు వారి గ్రాట్యుటీ, పీఎఫ్ మొత్తం యాజమాన్యం వద్ద డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని నెలనెలా పెన్షన్‌గా తీసుకుంటున్నారు. ఈ విధంగా ఉద్యోగుల కుటుంబాలు డిపాజిట్ చేసిన మొత్తం సుమారు రూ.350 కోట్లు యాజమాన్యం వద్ద ఉంది. పెన్షనర్లకు నెలనెలా రూ.5 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. గత ఆరు నెలల వరకూ ఏడో తేదీలోపు చెల్లించేవారు. కానీ అక్టోబరు నెల నుంచి పదో తేదీ దాటితే గానీ ఇవ్వడం లేదు. కేవలం పెన్షన్‌పై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న తమకు ఆలస్యం చేస్తే ఎలా?...అని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. తాము ఒక్కొక్కరం సగటున రూ.50 లక్షల వరకు డిపాజిట్ చేస్తే...వాటిపై వడ్డీని పెన్షన్‌గా ఇవ్వడానికి ఇబ్బందులు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఒకేసారి ఇవ్వాలని కూడా డిమాండ్ చేయడం లేదని, రోజుకు కోటి రూపాయలు చొప్పున ఇస్తే ఐదు రోజుల్లో అందరికీ పెన్షన్లు అందుతాయంటున్నారు. ఇంత పెద్ద స్టీల్‌ప్లాంటును నడుపుతున్న యాజమాన్యం ఆమాత్రం కూడా చేయలేదా?...అని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే తమకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

సామూహిక పారాయణం



పారాయణంలో మహిళలు

మాధవధార, మార్చి 19 ; ఉత్తర నియోజకవర్గంలోని పట్టాభిరెడ్డి తోట సూర్యానగర్ హైవే రోడ్డులోని శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు సామూహిక పారాయణం నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తికి సింధూర అర్చన, తమల పాకుల పూజలు, అష్టోత్తరం చేపట్టారు. అనంతరం సీతారామాచార్యుల మంగళశాసనంతో స్వపంతి మాతృమండలి ఆధ్యాత్మిక మహిళా సేవా సంస్థ వ్యవస్థాపకురాలు ఆర్.వి.సూర్యకుమారి నేతృత్వంలో మహిళా సభ్యులు హనుమాన్ చాలీసా, సుందర కాండ పారాయణం నిర్వహించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 19: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీల్‌మెట్ట సెక్షన్ పలు ఫీడర్‌లలో మరమ్మతు పనుల చేపట్టనున్నందున 21వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గురుద్వార ప్రాంతం, సీతంపేట, శాంతిపురం, జీవీకే ప్లాజా ప్రాంతం, రమా ఆసుపత్రి ప్రాంతం, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గాగణపతి ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయం

▸ టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 19: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన బలపరచిన కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నట్టు తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి, జనసేన పార్టీ నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన , టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ నగర వాసులు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలను కాదన్నారు. విశాఖలోని ప్రతీ నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్షలను ప్రణాళి కాయుతంగా పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపిద్దాం


అక్కయ్యపాలెం: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి పార్లమెంటరీ అభ్యర్థి శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని గ్రేటర్ 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పార్టీ శ్రేణులకు కోరారు. వార్డు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా వీరారావు మాట్లాడుతూ పార్టీ నేతలు నిరంతరం శ్రమించి పని చేయాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 27వ వార్డు టీడీపీకి కంచుకోట అని, 2014, 2019లలో సార్వత్రిక ఎన్నికలు, జీవీఎంసీ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారన్నారు. ఈ సమావేశంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, నాయకులు వీవీ రమణారావు, నాయకులు పొలుమూరి గురునాధరావు, పాలికల సింహాచలం, బీఏ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

26న ఆర్పీ పేట పైడితల్లమ్మ ప్రధాన పండగ

ఆర్పీపేట, కంచరపాలెం, మార్చి 19 : భక్తుల కొంగుబంగారం... రామ్మూర్తిపంతులపేట గ్రామ దేవత పైడితల్లమ్మ అమ్మవారి ప్రధాన పండగను ఈనెల 26వ తేదీ మంగళవారం నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు ఆలయాన్ని రంగులువేసి ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఈనెల 25వ తేదీన అమ్మవారి తొలేళ్లతో ఉత్సవాలతో ప్రారంభమై మారువారం వరకు గ్రామంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరగనున్నాయి. ఈ అమ్మవారిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి కూడా అమ్మవారి భక్తులు హాజరై పండగ రోజు మొక్కులు చెల్లించుకుంటారు.



పైడితల్లమ్మ

ఆలయ చరిత్ర..

ఆర్పీపేట పరిసర ప్రాంతాల నుంచి పూర్వీకులు వర్తకం నిమిత్తం ఇక్కడ నుంచి తగరపువలస సమీపంలోని పోలిపల్లి వద్ద వెలిసిన పైడితల్లమ్మ జాతరకు ఎడ్లబళ్లపై వెళ్లి అమ్మవారిని దర్శించుకునే వారు. ఈ క్రమంలో ఓ ఏడాది జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా భీమర శెట్టి గంగన్న అనే వ్యక్తిని మార్గమధ్యలో ఓ స్త్రీమూర్తి ఆపి బండెక్కి కూర్చుందని, ఆమె అమ్మవారి విశ్వరూపం చూసిన ఆ వ్యక్తి మూర్ఛతో కళ్లతిరిగి పడిపోయాడు. అనంతరం ఆర్పీపేట గ్రామానికి చేరుకున్న గంగన్న బండిలో అమ్మవారి విగ్రహం ప్రత్యక్షమైనట్టు ప్రతీతి. దీంతో ఊరు చివర వేపచెట్టు కింద విగ్రహాన్ని పెట్టారు. అప్పట్లో ఈ ప్రాంతమంతా సున్నంబట్టీలతో అడవిని తలపించేది. ఈ నేపథ్యంలో వేపచెట్టు కింద ఉంచిన అమ్మవారి విగ్రహాన్ని పూజలు చేయకపోవడంతో ఆర్పీపేట గ్రామమంతా కలరా, మశూచి, ఆటలమ్మ తదితర పలు అంటువ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో అప్పటి నుంచి అమ్మవారికి నిత్య పూజలు ప్రారంభించడంతో అంటువ్యాధులు అదుపులోకి వచ్చినట్టు పెద్దలు చెబుతుంటారు. నాటి నుంచి అమ్మవారికి నిత్యం పూజలు నిర్వహిస్తు వస్తున్నారు. ఏటా మార్చిలో అమ్మవారికి ప్రధాన పండగను కొనసాగిస్తున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన ప్రతి మంగళవారం ఆలయంలో నిత్యాన్నదానం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి.



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత చూపాలి ; కాంగ్రెస్

మురళీనగర్, మార్చి 19 ; సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ మూల.వెంకటరావు అన్నారు. రెండు రోజుల కిందట చిలకలూరిపేటలో జరిగిన సభా వేదికపై బీజేపీ, జనసేన, టీడీపీలు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావనే లేకపోవడం దురదృష్టకమన్నారు. అధికారమే అంతిమ నిర్ణయంగా ఈ నేతలు మాట్లాడారన్నారు. బీజేపీ గత పదేళ్లలో ఆంధ్ర అభివృద్ధికి పునాది కూడా వేయకుండా.. ఇపుడు ఎన్నికల సందర్భంగా వచ్చి మాట్లాడడం సబబుకాదన్నారు. మన ప్రాంత అభివృద్ధికి పాటు పడే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

'నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'



డీఎంహెచ్‌వోకు వినతి పత్రమిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతమ్మధార, మార్చి 19: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, వివిధ కేడర్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులు, ఇతర ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వినతి పత్ర మిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా తమకు సమాన పనికి సమాన వేతనం, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అధికారులను కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేశ్ తమ ఉద్యోగుల వేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేయాలని పి.జగదీశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశి భూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్ గోపినాథ్, రత్నం, అనిత, సూర్యకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.

శోభన్‌బాబు సినీ గీతాల సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్, మార్చి 19: నటభూషణ్ శోభన్‌బాబు 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న ఆయన నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ఆవిష్కరించారు. ద్వారకానగర్ విశాఖ పౌరగ్రంథాలయంలో ఈ సంగీత విభావరి ఆరోజు సాయంత్రం ప్రారంభవుతుందన్నారు. శోభన్‌బాబు వీరాభిమాని కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేడు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సదస్సు

సిరిపురం, మార్చి 19: లోక్‌సభ, శాసన సభ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించే నిమిత్తం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపిన వారితో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ, ప్రవర్తనా నియమావళి, నామినేషన్ల స్వీకరణ,ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు

ఆర్‌వో కార్యాలయం సిద్ధం



సిద్ధమవుతున్న వెస్ట్ ఆర్‌వో కార్యాలయం

జ్ఞానాపురం, మార్చి 19: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో అధికారులు సంబంధిత ఏర్పాట్లు ముమ్మరంచేశారు. విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియకు వీలుగా జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌వో) కార్యనిర్వహణకు వీలుగా ఇటీవల రూ. 7లక్షల వ్యయంతో బర్త్ అండ్ డెత్ నమోదు విభాగాన్ని ఆర్‌వో కార్యాలయంగా ఆధునికీకరించారు. దీంతోపాటు ఎన్నికల సిబ్బంది, వీడియో మానటరింగ్‌కు వీలుగా ఆయా గదులను జడ్సీ ఆర్.జి.వి. కృష్ణ కేటాయించారు. రాజకీయ పార్టీలు, పోలింగ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించేందుకు వీలుగా హాలును సిద్ధం చేస్తున్నారు.


విగ్రహాలకు ముసుగు

సీతమ్మధార, మార్చి 19: ఎన్నికల కోడ్ పుణ్యాన నగరంలోని పలు దుకాణాదారులు, చిరువ్యాపారుల దుకాణాల పేర్లు బయటకు కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం గ్రేటర్ విశాఖ 24, 25వ వార్డులో రాజకీయనాయకుల ఫ్లెక్సీలు, దుకాణాలపై పార్టీల ప్రచారం బోర్డులను తొలగించారు. దీంతో దుకాణ పేర్లు బయటకు కనిపిస్తుండడంపై యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. వార్డులో వైసీపీ బోర్డులు, ఫ్లెక్సీలు వార్డు నాయకులు దౌర్జన్యంతో బలవంతంగా పెట్టించినట్టు, ఇక వీటిని తొలగించడంపై వ్యాపారులు ఊపిరిపీల్చుకుంటున్నారు.




నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులో ఇందిరా గాంధీ, రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు తొడిగిన ముసుగులు

అబ్బురపరచిన పౌరరక్షణ సంస్థ వలంటీర్ల విన్యాసాలు



ప్రదర్శనను తిలకిస్తున్న అగ్నిమాపక అధికారులు



వ్యక్తిని సురక్షితంగా కిందకు దించుతున్న విన్యాసం

సీతమ్మధార, మార్చి 19: నగరంలోని శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థ వలంటీర్ల విన్యాసాలు అబ్బుర పరిచాయి. ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా 228వ బ్యాచ్ పౌర రక్షణ వలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జీవీఎంసీ అగ్ని మాపక అధికారి వై.హనుమంతరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్యలు...తొలుత శిక్షణపొందిన వలంటీర్ల నుంచి వందన సమర్పణను స్వీకరించారు. అనంతరం వలంటీర్లు పలు విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బహుళ అంతస్తుల్లో ప్రమాదాలు జరిగితే, అంతస్తుల్లోని క్షతగ్రతులను, వారితో పాటు ఉన్న వారిని సురక్షితంగా ఏ విధంగా కిందికి తీసుకువస్తారో విన్యాసాలతో చేసి చూపారు. పోలీసు వైర్‌లెస్ సెట్ల ద్వారా కమ్యూనికేషన్ చేయడం ప్రదర్శించారు. అగ్నిమాపక అధికారులు పౌర రక్షణ సంస్థలో యువతకు ఇస్తున్న శిక్షణను అభినందించారు. సంస్థ ఉప పౌర రక్షణ అధికారి, ఉప కలెక్టర్ కె.పద్మలత మాట్లాడుతూ, శిక్షణ పొందిన వలంటీర్ల అంతా అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రిటార్డ్ డాక్టర్ పి.రామారావు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు కమ్యూనికేషన్ శాఖ, సివిల్ డిఫెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రామాలయ అభివృద్ధి పనులు



మురళీనగర్‌లో ఆలయ ముఖద్వారం వద్ద చేపడుతున్న నిర్మాణ పనులు

మురళీనగర్, మార్చి 19; గ్రేటరు 50వవార్డు మురళీనగర్‌లో రామాలయ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, దాతల విరాళాలు, మందిరం నిధుల నుంచి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద కొత్తగా శ్లాబు నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు టి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, బి.లక్ష్మణరావు, కోశాధికారి పెంటకోట.శ్రీనివాస్, కార్యదర్శి సనపల.వరప్రసాద్ పర్యవేణలో 40 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు మేర ధ్వజ స్తంభం పనులు కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇపుడున్న గర్భ గుడి నుంచి ఆలయ ముఖద్వారం వరకు శ్లాబు కలుపుతున్నారు. దీంతో మందిరం మరింత విశాలంగా మారుతుందని, ప్రత్యేక పర్వదినాల సమయంలో వేడుకల నిర్వహణకు అనువుగా ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. మందిరం గ్రిల్స్, ప్రత్యేక డిజైన్ల మార్పుతో మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

21 నుంచి 23 వరకు నూకాంబిక దర్శనం నిలిపివేత

అనకాపల్లి టౌన్, మార్చి 19: నూకాంబిక అమ్మవారి దర్శనాన్ని 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ తెలిపారు. నూకాంబిక అమ్మవారి కొత్త అమా వాస్య జాతర సందర్భంగా బాలాలయంలోని అమ్మ వారి విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం మూడు రోజులపాటు భక్తులకు అమ్మ వారి దర్శన భాగ్యం వుండదన్నారు. 24వ తేదీ ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు పునః ప్రారంభం అవు తాయన్నారు.



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

వాకర్స్ క్లబ్ సభ్యుని మృతికి నివాళి

మాధవధార, మార్చి 19; స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్న నగరవాసి, మురళీగనగర్ వాకర్స్‌క్లబ్ సీనియరు సభ్యులు పి.విజయానందరావు (91) మంగళవారం ఢిల్లీలో మృతిచెందారు. ఈసందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి ఆయన మృతి పట్ల క్లబ్ సభ్యులతో కలసి నివాళి అర్పించారు. ఢిల్లీలోని విజయానందరావు కుటుంబీకులకు ఫోన్ ద్వారా తమ సానుభూతి తెలిపారు.స్వాతంత్ర్య సమరంలో విశాఖ నుంచి ఆయన పలువురు నేతలతో పనిచేశారని క్లబ్ అధ్యక్షులు చంద్రమౌళి తెలిపారు. ఆయన ఇటీవలే అనారోగ్య కారణాలతో ఢిల్లీలోని తన ఏకైక కుమార్తె ఇంటికి చేరినట్లు తెలిపారు.

శిలాఫలకంతో సరిపెట్టేశారు!

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయాలని టెండర్ దక్కించుకున్న సంస్థ భావించింది.

కదలిక లేని ప్రాజెక్టు

ముఖ్యమంత్రి హోదాలో 2019 డిసెంబరు 28న తొలిసారి నగరానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిటీ సెంట్రల్‌పార్క్‌లో రూ.116 కోట్లతో బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విశాఖ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మేలిమలుపు కాబోతోందని ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. కానీ, నాలుగున్నరేళ్ల గడిచినా ప్రాజెక్టు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్‌కు కొంత మేర రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఈ విషయమై సదరు కాంట్రాక్టు సంస్థ ఎన్నిసార్లు ప్రస్తావించినా పాలకుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అగ్రిమెంట్ చేసుకోకుండానే వెళ్లిపోయిందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

అదనపు షాక్

... 5వ పేజీ తరువాయి

జోనల్ అధికారి వద్ద ప్రస్తావించగా వినియోగదారులు నిర్దేశించిన లోడుకు మించి ఉపయోగిస్తున్నప్పుడు దానికి అదనపు చార్జీలు చెల్లించక తప్పదని స్పష్టంచేశారు. నోటీసులు అందుకున్నవారు ఎవరైనా అదనపు లోడు వినియోగించకపోతే దానిని లేఖ ద్వారా తెలియజేయవచ్చునని, మరోసారి వచ్చి పరిశీలిస్తారన్నారు. నిర్ధారణ అయితే దానికి సూచించిన ఫీజులు డీడీ రూపంలో కట్టి మీ-సేవా కేంద్రంలో ప్రత్యేక దరఖాస్తు ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

నిధులు విధులు లేవు

... 5వ పేజీ తరువాయి

సొంత ఖర్చులు పెరిగిపోయాయి. చైర్మన్‌కు జీతం, అలవెన్సు కలిపి సుమారు రూ.70 వేలు, డైరెక్టర్లకు రూ.12 వేలు వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే, రాష్ట్ర స్థాయి పదవి దక్కిందని చాలామంది నేతలు ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉన్నా..కార్లు కొనుగోలు చేసి బోర్డులు పెట్టుకున్నారు. దాని నిర్వహణతో పాటు పార్టీ సమావేశాలు, సభలు ఏర్పాటుచేసినప్పుడు పది మందిని వెంటేసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఈ విధంగా నాలుగేళ్లలో చాలామంది నేతలకు చేతి చమురు బాగానే వదిలిపోయింది. ఇదే విషయాన్ని పలువురు బాహాటంగానే చెప్పుకుంటూ బాధపడుతున్నారు.

బార్‌ల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అప్పటికీ విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో రెండింటిపై కేసులు నమోదుచేశారు. అయితే ఆ విషయాన్ని పోలీసులుగానీ, ఎక్సైజ్ అధికారులు గానీ బయటపెట్టకుండా గోప్యత పాటిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో దాదాపు అన్ని బార్‌లలో ఇదే పరిస్థితి ఉంది. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా మేల్కొనాలి.

నెరవేరని రెగ్యులరైజ్ హామీ

... 5వ పేజీ తరువాయి

వేతనాలు చెల్లిస్తున్నారు. ఏపీ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పని చేసేవారికి రూ.38,700, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసే వారికి రూ.27 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. రెగ్యులరైజ్ చేస్తే రూ.52 వేలు బేసిక్ వేతనం వస్తుందని, దీంతోపాటు ప్రభుత్వ ఉద్యోగికి వర్తించే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని పేర్కొంటున్నారు.

ఇవీ డిమాండ్లు

రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకూ 100 శాతం వేతనం (ఏపీ మినహాయించుకోకుండా) ఇవ్వాలని, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విధి నిర్వహణలో మరణించిన స్టాఫ్‌కు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పించాలని, కొవిడ్ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 52 మంది కుటుంబాలను ఆదుకోవాలని కోరు తున్నారు. భవిష్యత్తులో రెగ్యులర్ విధానంలోనే స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు స్టాఫ్ నర్సులను నియమించాలని కోరుతున్నారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఒక కేడర్‌కు ఒకే జీతం విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధి ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఈపీడీసీఎల్‌లో రెవెన్యూ టార్గెట్స్

... 5వ పేజీ తరువాయి

ప్రతినెలా సుమారు రూ.వెయ్యి కోట్లు బిల్లుల రూపంలో వసూలవుతుంది. ఏ జోన్ పరిధిలో ఎంత బిల్లింగ్ జరిగిందో అక్కడి డీఈలు లెక్క చూసుకుని, అందులో ఎంత వసూలైంది? ఇంకా వసూలు కావలసింది ఎంత? ఎవరి నుంచి రావాలి? వంటి వివరాలు పరిశీలించి వినియోగదారుల వెంట పడుతున్నారు. ఇంజనీర్లకు టార్గెట్లు విధిస్తే బకాయిలు ఉండవని, వారం పది రోజులు ఆలస్యమైనా బిల్లులు చెల్లిస్తారని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది రూ.లక్షల బకాయిలు పెడుతున్నారు. వాటిని తగ్గించుకోవాలంటే.. నెలాఖరుకల్లా వసూలు చేయడమే మార్గమని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఆలోచన బాగానే ఉంది కానీ ఆ బాధ్యత తమపై పెట్టడం ఏమిటని ఇంజనీర్లు వాపోతున్నారు.

అసంపూర్తిగా బైపాస్ రోడ్డు నిర్మాణం

రైల్వే అడ్డంకుల కారణంగా ఐదేళ్లుగా కదలిక లేని వైనం

ఫలితంగా శ్మశానవాటిక కూడలిలో ప్రజలకు తప్పని ఇబ్బందులు

గోపాలపట్నం, మార్చి 19: రైల్వే అడ్డంకుల సమస్య కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన బైపాస్ రహదారి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో రద్దీని తగ్గించాలనే ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన ఈ రహదారి ఐదేళ్లుగా అసంపూర్తిగానే నిలిచిపోవడంతో శ్మశానవాటిక కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..

గోపాలపట్నం శ్మశానవాటిక కూడలి నుంచి రవీంద్రనగర్ మీదుగా బాజీ జంక్షన్‌ను కలిపే బైపాస్ రహదానికి గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన వందలాది మంది వినియోగిస్తున్నారు. ప్రధాన రోడ్డులో డివైడర్ల నిర్మాణం చేపట్టిన తర్వాత రహదారిని దాటే వీల్లేకపోవడంతో పాటు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో దిగువ ప్రాంతాల ప్రజలు పాత గోపాలపట్నం, బాజీ జంక్షన్‌లకు వెళ్లాలంటే ఇదే మార్గాన్ని వినియోగిస్తుంటారు. దీంతో మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. అయితే రైల్వే అధికారులు రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. అయితే ఇందుకు సంబంధించి అనుమతులు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులు ఇప్పటికీ శ్రద్ధ చూపకపోవడంతో బైపాస్ రోడ్డు నిర్మాణం జరగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.


రవీంద్రనగర్ నుంచి బాజీ జంక్షన్‌ను కలిపే రోడ్డును రహదారిని అసంపూర్తిగా నిర్మించి విడిచిపెట్టిన దృశ్యం

శ్మశానవాటిక కూడలిలో పెరుగుతున్న రద్దీ

రవీంద్రనగర్ మీదుగా బాజీ జంక్షన్‌కు వెళ్లే బైపాస్ రహదారి నిర్మాణం జరిగితే శ్మశానవాటిక కూడలిలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ప్రస్తుతం ఈ రహదారిలో రాకపోకలు సాగించేందుకు వీల్లేకపోవడంతో గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన వాహనచోదకులు శ్మశానవాటిక కూడలి మీదగానే బీఆర్‌టీఎస్‌కు చేరుతున్నారు. దీంతో ఈ కూడలిలో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. నిత్యం ముగ్గురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నా ఇబ్బందులు తప్పడం లేదంటే ఇక్కడ ఏ మేరకు ఇబ్బందులు తలెత్తుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడితే శ్మశానవాటిక కూడలిలో రద్దీ తగ్గడంతో పాటు గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన వేలాది మందికి ఎంతో మేలు చేకూరుతుంది.

స్టీల్‌ప్లాంట్‌లో అమలవుతున్న బయోమెట్రిక్ హాజరు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19: స్టీల్‌ప్లాంట్‌లోని కొన్ని విభాగాలలో బయోమెట్రిక్ హాజరు అమలు జరుగుతోంది. ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని గతంలోనే యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత కొన్ని కారణాలతో బయోమెట్రిక్ హాజరు కొన్ని రోజుల పాటు వాయిదా పడింది. దీంతో ఉద్యోగులు ఇప్పటి వరకు కొనసాగిన డార్స్ విధానంలోనే హాజరు వేశారు. అయితే ఉక్కు యాజమాన్యం బయోమెట్రిక్‌కు తప్పనిసరిగా ఉద్యోగులు తమ ఐడెండిటీని ఇవ్వాలని సూచించినా కార్మిక వర్గం ముందుకు రాలేదు. ఈ క్రమంలో ఉక్కు యాజమాన్యం మరోసారి ఉత్తర్వులు విడుదల చేసి బయోమెట్రిక్‌కు వివరాలు ఇవ్వని వారికి డార్స్‌లో కూడా సంతకాలు చేసేందుకు అవకాశం ఇవ్వమని, ఒకవేళ విధులకు హాజరైనా సెలవుగా చూడాల్సి వస్తుందని పేర్కొనడంతో పలువురు ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఐడెంటిటీని ఇస్తున్నారు. ప్లాంట్‌లో చాలామంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు బయోమెట్రిక్‌కు తమ ఐడెంటిటీని ఇచ్చారు. త్వరలో పూర్తి స్థాయిలో బయోమెట్రిక్ హాజరు అమలయ్యేలా ఉక్కు యాజమాన్యం చర్యలు చేపడుతున్నది.

టీడీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 9: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలనే ధ్యేయంతో టీడీపీ విజయం కోసం శ్రమించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కోరారు. 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం పల్లా సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కె.రాము, సత్య, ప్రభ, వెంకటలక్ష్మి, ప్రభావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మహిళలతో పల్లా శ్రీనివాసరావు

ప్రజలకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే గణబాబు

సింధియా: పేదలు, సామాజిక వర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉమ్మడి అభ్యర్థి పి.గణబాబు అన్నారు. 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేసినందున రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల వారికి సమాంతర న్యాయం చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు గణబాబు వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంటులో చెలరేగిన మంటలు

ఓ ఫ్లాట్ నివాసితులు వాషింగ్ మెషిన్ ఆన్ చేసి ఊరెళ్లడంతో జరిగిన ప్రమాదం

పెందుర్తి, మార్చి 19: సుజానగర్ 80 అడుగుల రోడ్డు సమీపం గొల్లవిల్లిపాలెంలో గల ప్రశాంతి నిలయం అపార్టుమెంటులోని ఓ ఫ్లాట్‌లో మంగళవారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఫ్లాట్‌లో ఎవరూ లేరు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లవిల్లిపాలెంలోని అపార్టుమెంటు పై ఫ్లాట్‌లో మంటలు రావడాన్ని స్థానికులు గుర్తించి అపార్ట్‌మెంట్ నివాసితులకు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మర్రిపాలెం నుంచి అగ్నిమాపక సిబ్బంది అపార్ట్‌మెంటుకు చేరుకుని మంటలు ఇతర ఫ్లాట్లకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఆ ఫ్లాట్ బాల్కనీ స్థలంలో వాషింగ్‌మెషిన్ స్విచ్ ఆన్ చేసి రన్నింగ్‌లో ఉండడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కాగా ఆ ఫ్లాట్‌లో ఉంటున్న యజమాని కుటుంబంతో సహా రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. మంటల్లో వాషింగ్ మిషన్ దగ్ధం కావడం తప్ప ఎలాంటి ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో అపార్టుమెంటువాసులు ఊపిరి పీల్చుకున్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీశ్‌నాయుడు

భద్రతతోనే ఉక్కు కర్మాగారం ప్రగతి

ఆర్ఎస్అండ్ఆర్ఎస్ విభాగాధిపతి వై.సతీశ్‌నాయుడు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి భద్రత చర్యలు తీసుకుంటున్నామని ఆర్ఎస్అండ్ఆర్ఎస్ విభాగాధిపతి వై.సతీశ్‌నాయుడు అన్నారు. విభాగం భద్రతావారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతతోనే ప్లాంట్ ప్రగతి ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఉద్యోగి, కార్మికులు పూర్తి భద్రత నడుమ విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఏ మాత్రం ఇబ్బందులు ఉన్న తక్షణమే అధికారులకు సమాచారం అందించాలన్నారు. భద్రత తరగతులకు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాసరావు, జి.సన్యాసిరాజు, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వాసీవాలో పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ఆటోనగర్, మార్చి 19: విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (వాసీవా) కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ఎంఈ లీన్ స్కీమ్‌పై పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి లీన్ టెక్నిక్‌లో ఉత్పత్తిని ఎలా పెంచుకోవచ్చు, ఉత్పత్తిలో వ్యర్థాలను ఎలా తగ్గించుకోవచ్చు, లీన్ టెక్నిక్‌లో ప్రధానంగా బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్ స్టేజ్‌లు ఎలా ఉపయోగపడతాయి, తద్వారా పారిశ్రామిక ఉత్పత్తులకు దోహదపడే అంశాల గురించి వివరించారు. పారిశ్రామికవేత్తలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. ఐలా మాజీ ఛైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పాలసీ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడకు చెందిన పారిశ్రామికవేత్త సత్యనారాయణ, వాసీవా ప్రతినిధులు పరుచూరి ప్రభాకర్, రామ్‌ప్రసాద్, చీకటి సత్యనారాయణ, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏడీ చంద్రమౌళి

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం

శ్రీనగర్, మార్చి 19: గ్రేటర్ 71వ పరిధి వార్డు శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయగణపతి, రమా సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ గోవర్ధనగిరి ఆలయంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, సకల దేవతా మండపారాధన, కలశ స్థాపన, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం రమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణ, సంతాన గోపాల మూలమంత్రం హోమాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.సూర్యనారాయణ, కె.సహదేవుడు, పంచముఖేశ్వరరావు, శ్రీనివాస రాజు, బి.లక్ష్మణరాజు, కృష్ణమూర్తి, చెల్లారావు, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దుర్గాదేవి ఆలయంలో 'పల్లా' ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు బర్మాకాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక శక్తుల పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు బొసెట్టి అప్పారావు, టి.సుదర్శన్, ఉగ్రం, వెంకటరావు, పి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఉత్సవాలు ప్రారంభం

గాజువాక: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం అమ్మవారి ఘటాల ఊరేగింపు, పండుగ చాటింపు నిర్వహించారు. ఈ నెల 26న అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ముత్యాలమ్మవారి మాలధారణ చేపట్టిన భక్తులు

వేపగుంట: వేపగుంట పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ పండుగలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారి మాలధారణను సుమారు 150 మంది భక్తులు చేపట్టారు. జరిగాయి. వేకువజాము నాలుగు గంటల నుంచే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మాలధారణ స్వీకరించిన భక్తులకు నియమ నిబంధనల గురించి అర్చకులు శేషాద్రి శర్మ వివరించారు. ఈ నెల 28న ప్రధాన పండుగను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు గ్రామపెద్ద ముత్యా నాయుడు తెలిపారు.

వైభవంగా పోలమాంబ పండుగ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామ ప్రజల ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించాక ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు ప్రత్యేక జరిపారు. రాత్రి చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ ఎ.సన్యాసి అప్పారావు, గిరిప్రసాద్, శివాజీ, సతీశ్‌కుమార్, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

సహస్ర కలశాలతో శోభాయాత్ర

కూర్మన్నపాలెం, మార్చి 19: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో మంగళవారం దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా భక్తులు సహస్ర కలశాలతో శోభాయాత్ర చేపట్టారు. దేవతా మూలమంత్ర హోమాలు, ధాన్యాధివాసం, నీరాజన మంత్రపుష్పాలు, వేదస్వస్తి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వాసు, శ్రీధర్ స్వాములు పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనలతో పురవీధుల్లో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ నెల 20న యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, సారె ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు కుచ్చర్లపాటి రామరాజు, ఎస్.బాబూరావు, ఎ.పెంటారావు, బి.అప్పలరాజు, ఐ.సన్యాసిరాజు, బీవీఆర్ రాజు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-2 కాంప్లెక్స్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని మంగళవారం స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) సంజీవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం ఓ సంజీవని అని, పుస్తక జ్ఞానం అపారమైనదన్నారు. నేటి కాలంలో అందరూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి విలువైన జ్ఞానాన్ని కోల్పోతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జె.రామకృష్ణ, బోసుబాబు, రాజుబాబు, మసేన్‌రావు, ఆనంద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


కాలిపోతున్న ద్విచక్ర వాహనం

కూర్మన్నపాలెం, మార్చి 19: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ బైకు దగ్ధమైంది. ఇక్కడి ఎంవీవీ పార్కు అపార్టుమెంటు వద్ద పార్కింగ్‌లో ఉన్న ఓ బైకు దగ్ధమై ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దగ్ధమవుతున్న బైకుకు సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో సమీపంలో ఉన్న వర్కర్లు, కాలనీవాసులు భయంతో పరుగులు తీశారు. కొన్ని నిమిషాలలోనే ఈ ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది.

సినిమా గైడ్

● **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)

● **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)

● **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)

● **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 21, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 76, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడుచిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీసీపీ ఎం.సత్తిబాబు

సౌత్ డివిజన్‌లోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గాజువాక, మార్చి 19: సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో మంగళవారం రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీసీపీ ఎం.సత్తిబాబు మాట్లాడుతూ అందరూ ఎటువంటి అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. ఎటువంటి తగాదాలకు దిగరాదని, రానున్న ఎన్నికల సమయంలో ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐ ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శివయ్య, తదితరులు

కూర్మన్నపాలెం, మార్చి 19: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వడ్లపూడి, కణితి, సిద్ధార్థనగర్, రాజులపాలెంలలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.శివయ్య మాట్లాడుతూ క్షయ గాలి ద్వారా ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధి అని, తొలి దశలో దీనిని గుర్తించినట్టయితే చికిత్స సులభతరమవుతుందన్నారు. ఇది మైకో బ్యాక్టీరియం ట్యూబర్‌క్యులేషన్ అనే బ్యాక్టీరియా ద్వారా సంక్రమిస్తుందని పేర్కొన్నారు. మద్యపానం, పొగాకు, తదితర వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలని కోరారు. ఛాతీలో నొప్పి, అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చలి జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం వంటి లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాబీ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ కాంట్రాక్టు కార్మికుల నిరసన



విధులు బహిష్కరించి బయటకు వచ్చిన కాంట్రాక్టు కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 19: కనీస వేతనాలను అమలు చేయాలని కోరుతూ విశాఖ డెయిరీ కాంట్రాక్టు కార్మికులు కొందరు మంగళవారం ఉదయం విధులు బహిష్కరించి సంస్థ మెయిన్ గేటు వద్ద నిరసన తెలిపారు. కర్మాగారంలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస వేతనాలు చెల్లించకపోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సదుపాయాలు కల్పించడంలో కాంట్రాక్టర్‌తో పాటు డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు పెంచి తమకు కనీస సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాగా సంస్థలో ఉత్పత్తికి ఎటువంటి అంతరాయం వాటిల్లకుండా విధులకు హాజరైన కొంతమంది కాంట్రాక్టు కార్మికులతో పాటు పర్మినెంట్ కార్మికులతో యాజమాన్యం అదనపు సమయం విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. సాయంత్రం యాజమాన్యంతో కాంట్రాక్టరు జరిపిన చర్చల్లో వేతనాల పెంపులో పలు మార్పులు చేయడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు.

బీసీ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

పెదగంట్యాడ, మార్చి 19: గాజువాక నుంచి పెదగంట్యాడ వెళ్లే రోడ్డులో న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, తదితర అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో స్థాయికి మించి నగదు రవాణా జరగవచ్చన్న అనుమానంతో తనిఖీలు జరిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంచిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ-చలానాలు పెండింగ్‌లో ఉన్న వాహనదారులను గుర్తించి వాటిని కట్టించారు. న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

డీసీసీ కార్యదర్శిగా చెల్లుబోయిన నాయుడు



పెదగంట్యాడ, మార్చి 19: జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా చెల్లుబోయిన నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపా గోవిందరాజు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనను డీసీసీ కార్యదర్శిగా నియమించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

1,132వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం, మార్చి 19: ప్రజల మనోభావాలను, ఎన్నికల వాగ్దానాలను లెక్కచేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.రామకృష్ణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,132వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన పాలకులు కార్పొరేట్ చేతుల్లో కీలుబొమ్మలా మారుతున్నారన్నారు. కార్మికులు, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వాలకు తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టరూ!

పెదగంట్యాడ, మార్చి 19: మండలంలోని వివిధ ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వల్ల దుమ్ము, ధూళి, ఇతర కాలుష్య కారకాలు ఎగిరి వచ్చి నివాసాలపై పడుతున్నాయని, దీంతో డాబాలపై, ఇళ్లలోనూ నల్లని ధూళి చేరుతుందని వాపోతున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఈ కాలుష్య ప్రభావం మరీ అధికంగా ఉంటుందని చెబుతున్నారు. స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, పెదగంట్యాడ పారిశ్రామికవాడ, వీటి పరిసరాల్లోని ట్రాన్స్‌పోర్టు యార్డుల నుంచి కాలుష్యం వెలువడుతుంది. ఆయా పరిశ్రమల్లో కాలుష్య నివారణకు తగిన చర్యలు చేపట్టకపోవడం, మెటీరియల్‌ను ట్రాన్స్‌పోర్టు చేసేటప్పుడు ఆయా వాహనాలపై టార్పాన్లు కప్పకపోవడం, స్టాక్ యార్డులలో ఓపెన్ ఏరియాలో మెటీరియల్‌ను నిల్వ చేయడం, చిన్నతరహా పరిశ్రమల్లో కాలుష్యంపై నియంత్రణ లేకపోవడం వంటి కారణాలతో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. దీనితో హౌసింగ్ బోర్డు కాలనీ, పెదగంట్యాడ, గంగవరం, వెంకన్నపాలెం, యాతపాలెం, అశోక్‌నగర్, దిబ్బపాలెం, కొత్తకాలనీ, ప్రియదర్శనీ కాలనీలకు కాలుష్యం తాకిడి అధికంగా ఉంటుంది. ఏటా ఫిబ్రవరి నుంచి నాలుగు నెలల పాటు కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీల అసోసియేషన్లు, స్థానిక నాయకులు పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

సామూహిక పారాయణం



పారాయణంలో మహిళలు

మాధవధార, మార్చి 19 ; ఉత్తర నియోజకవర్గంలోని పట్టాభిరెడ్డి తోట సూర్యానగర్ హైవే రోడ్డులోని శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు సామూహిక పారాయణం నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తికి సింధూర అర్చన, తమల పాకుల పూజలు, అష్టోత్తరం చేపట్టారు. అనంతరం సీతారామాచార్యుల మంగళశాసనంతో స్రవంతి మాతృమండలి ఆధ్యాత్మిక మహిళా సేవా సంస్థ వ్యవస్థాపకురాలు ఆర్.వి.సూర్యకుమారి నేతృత్వంలో మహిళా సభ్యులు హనుమాన్ చాలీసా, సుందర కాండ పారాయణం నిర్వహించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 19: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీల్‌మెట్ట సెక్షన్ పలు ఫీడర్‌లలో మరమ్మతు పనుల చేపట్టనున్నందున 21వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గురుద్వార ప్రాంతం, సీతంపేట, శాంతిపురం, జీవీకే ప్లాజా ప్రాంతం, రమా ఆసుపత్రి ప్రాంతం, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గాగణపతి ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయం

» టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 19: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన బలపరచిన కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నట్టు తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి, జనసేన పార్టీ నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన , టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ నగర వాసులు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలను కాదన్నారు. విశాఖలోని ప్రతీ నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్షలను ప్రణాళి కాయుతంగా పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపిద్దాం

అక్కయ్యపాలెం: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి పార్లమెంటరీ అభ్యర్థి శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని గ్రేటర్ 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పార్టీ శ్రేణులకు కోరారు. వార్డు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా వీరారావు మాట్లాడుతూ పార్టీ నేతలు నిరంతరం శ్రమించి పని చేయాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 27వ వార్డు టీడీపీకి కంచుకోట అని, 2014, 2019లలో సార్వత్రిక ఎన్నికలు, జీవీఎంసీ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారన్నారు. ఈ సమావేశంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, నాయకులు వీవీ రమణారావు, నాయకులు పొలుమూరి గురునాధరావు, పాలికల సింహాచలం, బీఏ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న ఆర్పీ పేట పైడితల్లమ్మ ప్రధాన పండగ



పైడితల్లమ్మ

ఆర్పీపేట, కంచరపాలెం, మార్చి 19 : భక్తుల కొంగుబంగారం... రామ్మూర్తిపంతులపేట గ్రామ దేవత పైడితల్లమ్మ అమ్మవారి ప్రధాన పండగను ఈనెల 26వ తేదీ మంగళవారం నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు ఆలయాన్ని రంగులువేసి ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఈనెల 25వ తేదీన అమ్మవారి తొలేళ్లతో ఉత్సవాలతో ప్రారంభమై మారువారం వరకు గ్రామంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరగనున్నాయి. ఈ అమ్మవారిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి కూడా అమ్మవారి భక్తులు హాజరై పండగ రోజు మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయ చరిత్ర..

ఆర్పీపేట పరిసర ప్రాంతాల నుంచి పూర్వీకులు వర్తకం నిమిత్తం ఇక్కడ నుంచి తగరపువలస సమీపంలోని పోలిపల్లి వద్ద వెలిసిన పైడితల్లమ్మ జాతరకు ఎడ్లబళ్లపై వెళ్లి అమ్మవారిని దర్శించుకునే వారు. ఈ క్రమంలో ఓ ఏడాది జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా భీమర శెట్టి గంగన్న అనే వ్యక్తిని మార్గమధ్యలో ఓ స్త్రీమూర్తి ఆపి బండెక్కి కూర్చుందని, ఆమె అమ్మవారి విశ్వరూపం చూసిన ఆ వ్యక్తి మూర్ఛతో కళ్లతిరిగి పడిపోయాడు. అనంతరం ఆర్పీపేట గ్రామానికి చేరుకున్న గంగన్న బండిలో అమ్మవారి విగ్రహం ప్రత్యక్షమైనట్టు ప్రతీతి. దీంతో ఊరు చివర వేపచెట్టు కింద విగ్రహాన్ని పెట్టారు. అప్పట్లో ఈ ప్రాంతమంతా సున్నంబట్టీలతో అడవిని తలపించేది. ఈ నేపథ్యంలో వేపచెట్టు కింద ఉంచిన అమ్మవారి విగ్రహాన్ని పూజలు చేయకపోవడంతో ఆర్పీపేట గ్రామమంతా కలరా, మశూచి, ఆటలమ్మ తదితర పలు అంటువ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో అప్పటి నుంచి అమ్మవారికి నిత్య పూజలు ప్రారంభించడంతో అంటువ్యాధులు అదుపులోకి వచ్చినట్టు పెద్దలు చెబుతుంటారు. నాటి నుంచి అమ్మవారికి నిత్యం పూజలు నిర్వహిస్తు వస్తున్నారు. ఏటా మార్చిలో అమ్మవారికి ప్రధాన పండగను కొనసాగిస్తున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన ప్రతి మంగళవారం ఆలయంలో నిత్యాన్నదానం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి.



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత చూపాలి ; కాంగ్రెస్

మురళీనగర్, మార్చి 19 ; సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ మూల.వెంకటరావు అన్నారు. రెండు రోజుల కిందట చిలకలూరిపేటలో జరిగిన సభా వేదికపై బీజేపీ, జనసేన, టీజేపీలు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావనే లేకపోవడం దురదృష్టకమన్నారు. అధికారమే అంతిమ నిర్ణయంగా ఈ నేతలు మాట్లాడారన్నారు. బీజేపీ గత పదేళ్లలో ఆంధ్ర అభివృద్ధికి పునాది కూడా వేయకుండా.. ఇపుడు ఎన్నికల సందర్భంగా వచ్చి మాట్లాడడం సబబుకాదన్నారు. మన ప్రాంత అభివృద్ధికి పాటు పడే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

'నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'



డీఎంహెచ్‌వోకు వినతి పత్రమిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతమ్మధార, మార్చి 19: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, వివిధ కేడర్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఫార్మసిస్టులు, ఇతర ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వినతి పత్ర మిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా తమకు సమాన పనికి సమాన వేతనం, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అధికారులను కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేశ్ తమ ఉద్యోగుల వేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేయాలని వి.జగదీశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశి భూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్ గోపీనాథ్, రత్నం, అనిత, సూర్యకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.

శోభన్‌బాబు సినీ గీతాల సంగీత విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్, మార్చి 19: నటభూషణ్ శోభన్‌బాబు 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న ఆయన నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ఆవిష్కరించారు. ద్వారకానగర్ విశాఖ పౌరగ్రంథాలయంలో ఈ సంగీత విభావరి ఆరోజు సాయంత్రం ప్రారంభవుతుందన్నారు. శోభన్‌బాబు వీరాభిమాని కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సదస్సు

సిరిపురం, మార్చి 19: లోక్‌సభ, శాసన సభ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించే నిమిత్తం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపిన వారితో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ, ప్రవర్తనా నియమావళి, నామినేషన్ల స్వీకరణ,ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

చురుగ్గా రామాలయ అభివృద్ధి పనులు



మురళీనగర్‌లో ఆలయ ముఖద్వారం వద్ద చేపడుతున్న నిర్మాణ పనులు

మురళీనగర్, మార్చి 19; గ్రేటరు 50వవార్డు మురళీనగర్‌లో రామాలయ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, దాతల విరాళాలు, మందిరం నిధుల నుంచి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద కొత్తగా శ్లాబు నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు టి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, బి.లక్ష్మణరావు, కోశాధికారి పెంటకోట.శ్రీనివాస్, కార్యదర్శి సనపల.వరప్రసాద్ పర్యవేణలో 40 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు మేర ధ్వజ స్తంభం పనులు కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇపుడున్న గర్భ గుడి నుంచి ఆలయ ముఖద్వారం వరకు శ్లాబు కలుపుతున్నారు. దీంతో మందిరం మరింత విశాలంగా మారుతుందని, ప్రత్యేక పర్వదినాల సమయంలో వేడుకల నిర్వహణకు అనువుగా ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. మందిరం గ్రిల్స్, ప్రత్యేక డిజైన్ల మార్పుతో మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

21 నుంచి 23 వరకు నూకాంబిక దర్శనం నిలిపివేత



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, మార్చి 19: నూకాంబిక అమ్మవారి దర్శనాన్ని 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ తెలిపారు. నూకాంబిక అమ్మవారి కొత్త అమా వాస్య జాతర సందర్భంగా బాలాలయంలోని అమ్మ వారి విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం మూడు రోజులపాటు భక్తులకు అమ్మ వారి దర్శన భాగ్యం వుండదన్నారు. 24వ తేదీ ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు పునః ప్రారంభం అవు తాయన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యుని మృతికి నివాళి

మాధవధార, మార్చి 19; స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్న నగరవాసి, మురళీగనగర్ వాకర్స్‌క్లబ్ సీనియరు సభ్యులు పి.విజయానందరావు (91) మంగళవారం ఢిల్లీలో మృతిచెందారు. ఈసందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి ఆయన మృతి పట్ల క్లబ్ సభ్యులతో కలసి నివాళి అర్పించారు. ఢిల్లీలోని విజయానందరావు కుటుంబీకులకు ఫోన్ ద్వారా తమ సానుభూతి తెలిపారు.స్వాతంత్ర్య సమరంలో విశాఖ నుంచి ఆయన పలువురు నేతలతో పనిచేశారని క్లబ్ అధ్యక్షులు చంద్రమౌళి తెలిపారు. ఆయన ఇటీవలే అనారోగ్య కారణాలతో ఢిల్లీలోని తన ఏకైక కుమార్తె ఇంటికి చేరినట్లు తెలిపారు.

శిలాఫలకంతో సరిపెట్టేశారు!

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయాలని టెండర్ దక్కించుకున్న సంస్థ భావించింది.

కదలిక లేని ప్రాజెక్టు

ముఖ్యమంత్రి హోదాలో 2019 డిసెంబరు 28న తొలిసారి నగరానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిటీ సెంట్రల్‌పార్క్‌లో రూ.116 కోట్లతో బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విశాఖ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మేలిమలుపు కాబోతోందని ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. కానీ, నాలుగున్నరేళ్లు గడిచినా ప్రాజెక్టు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్‌కు కొంత మేర రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఈ విషయమై సదరు కాంట్రాక్టు సంస్థ ఎన్నిసార్లు ప్రస్తావించినా పాలకుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అగ్రిమెంట్ చేసుకోకుండానే వెళ్లిపోయిందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

అదనపు షాక్

... 5వ పేజీ తరువాయి

జోనల్ అధికారి వద్ద ప్రస్తావించగా వినియోగదారులు నిర్దేశించిన లోడుకు మించి ఉపయోగిస్తున్నప్పుడు దానికి అదనపు చార్జీలు చెల్లించక తప్పదని స్పష్టంచేశారు. నోటీసులు అందుకున్నవారు ఎవరైనా అదనపు లోడు వినియోగించకపోతే దానిని లేఖ ద్వారా తెలియజేయవచ్చునని, మరోసారి వచ్చి పరిశీలిస్తారన్నారు. నిర్ధారణ అయితే దానికి సూచించిన ఫీజులు డీడీ రూపంలో కట్టి మీ-సేవా కేంద్రంలో ప్రత్యేక దరఖాస్తు ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

నిధులు విధులు లేవు

... 5వ పేజీ తరువాయి

సొంత ఖర్చులు పెరిగిపోయాయి. చైర్మన్‌కు జీతం, అలవెన్సు కలిపి సుమారు రూ.70 వేలు, డైరెక్టర్లకు రూ.12 వేలు వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే, రాష్ట్ర స్థాయి పదవి దక్కిందని చాలామంది నేతలు ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉన్నా..కార్లు కొనుగోలు చేసి బోర్డులు పెట్టుకున్నారు. దాని నిర్వహణతో పాటు పార్టీ సమావేశాలు, సభలు ఏర్పాటుచేసినప్పుడు పది మందిని వెంటేసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఈ విధంగా నాలుగేళ్లలో చాలామంది నేతలకు చేతి చమురు బాగానే వదిలిపోయింది. ఇదే విషయాన్ని పలువురు బాహాటంగానే చెప్పుకుంటూ బాధపడుతున్నారు.

బార్‌ల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అప్పటికీ విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో రెండింటిపై కేసులు నమోదుచేశారు. అయితే ఆ విషయాన్ని పోలీసులుగానీ, ఎక్సైజ్ అధికారులు గానీ బయటపెట్టకుండా గోప్యత పాటిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో దాదాపు అన్ని బార్‌లలో ఇదే పరిస్థితి ఉంది. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా మేల్కొనాలి.

నెరవేరని రెగ్యులరైజ్ హామీ

... 5వ పేజీ తరువాయి

వేతనాలు చెల్లిస్తున్నారు. ఏపీ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పని చేసేవారికి రూ.38,700, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసేవారికి రూ.27 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. రెగ్యులరైజ్ చేస్తే రూ.52 వేలు బేసిక్ వేతనం వస్తుందని, దీంతోపాటు ప్రభుత్వ ఉద్యోగికి వర్తించే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని పేర్కొంటున్నారు.

ఇవీ డిమాండ్లు

రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకూ 100 శాతం వేతనం (ఏపీ మినహాయించుకోకుండా) ఇవ్వాలని, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విధి నిర్వహణలో మరణించిన స్టాఫ్‌కు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పించాలని, కొవిడ్ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 52 మంది కుటుంబాలను ఆదుకోవాలని కోరు తున్నారు. భవిష్యత్తులో రెగ్యులర్ విధానంలోనే స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు స్టాఫ్ నర్సులను నియమించాలని కోరుతున్నారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఒక కేడర్‌కు ఒకే జీతం విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధి ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఈపీడీసీఎల్‌లో రెవెన్యూ టార్గెట్స్

... 5వ పేజీ తరువాయి

ప్రతినెలా సుమారు రూ.వెయ్యి కోట్లు బిల్లుల రూపంలో వసూలవుతుంది. ఏ జోన్ పరిధిలో ఎంత బిల్లింగ్ జరిగిందో అక్కడి డీఈలు లెక్క చూసుకుని, అందులో ఎంత వసూలైంది? ఇంకా వసూలు కావలసింది ఎంత? ఎవరి నుంచి రావాలి? వంటి వివరాలు పరిశీలించి వినియోగదారుల వెంట పడుతున్నారు. ఇంజనీర్లకు టార్గెట్లు విధిస్తే బకాయిలు ఉండవని, వారం పది రోజులు ఆలస్యమైనా బిల్లులు చెల్లిస్తారని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది రూ.లక్షల బకాయిలు పెడుతున్నారు. వాటిని తగ్గించుకోవాలంటే... నెలాఖరుకల్లా వసూలు చేయడమే మార్గమని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఆలోచన బాగానే ఉంది కానీ ఆ బాధ్యత తమపై పెట్టడం ఏమిటని ఇంజనీర్లు వాపోతున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు

ఆర్‌వో కార్యాలయం సిద్ధం



సిద్ధమవుతున్న వెస్ట్ ఆర్‌వో కార్యాలయం

జ్ఞానాపురం, మార్చి 19: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో అధికారులు సంబంధిత ఏర్పాట్లు ముమ్మరంచేశారు. విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియకు వీలుగా జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌వో) కార్యనిర్వహణకు వీలుగా ఇటీవల రూ. 7లక్షల వ్యయంతో బర్త్ అండ్ డెత్ నమోదు విభాగాన్ని ఆర్‌వో కార్యాలయంగా ఆధునికీకరించారు. దీంతోపాటు ఎన్నికల సిబ్బంది, వీడియో మానటరింగ్‌కు వీలుగా ఆయా గదులను జడ్సీ ఆర్.జి.వి. కృష్ణ కేటాయించారు. రాజకీయ పార్టీలు, పోలింగ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించేందుకు వీలుగా హాలును సిద్ధం చేస్తున్నారు.

విగ్రహాలకు ముసుగు



నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులో ఇందిరా గాంధీ, రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు తొడిగిన ముసుగులు

సీతమ్మధార, మార్చి 19: ఎన్నికల కోడ్ పుణ్యాన నగరంలోని పలు దుకాణాదారులు, చిరువ్యాపారుల దుకాణాల పేర్లు బయటకు కనిపిస్తున్నాయి. ఎ న్నికల కమిషన్ నియమావళి ప్రకారం గ్రేటర్ విశాఖ 24, 25వ వార్డులో రాజకీయనాయకుల ఫ్లెక్సీలు, దుకాణాలపై పార్టీల ప్రచారం బోర్డులను తొలగించారు. దీంతో దుకాణ పేర్లు బయటకు కనిపిస్తుండడంపై యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. వార్డులో వైసీపీ బోర్డులు, ఫ్లెక్సీలు వార్డు నాయకులు దౌర్జన్యంతో బలవంతంగా పెట్టించినట్టు, ఇక వీటిని తొలగించడంపై వ్యాపారులు ఊపిరిపీల్చుకుంటున్నారు.

అబ్బురపరచిన పౌరరక్షణ సంస్థ వలంటీర్ల విన్యాసాలు



ప్రదర్శనను తిలకిస్తున్న అగ్నిమాపక అధికారులు



వ్యక్తిని సురక్షితంగా కిందకు దించుతున్న విన్యాసం

సీతమ్మధార, మార్చి 19: నగరంలోని శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థ వలంటీర్ల విన్యాసాలు అబ్బుర పరిచాయి. ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా 228వ బ్యాచ్ పౌర రక్షణ వలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జీవీఎంసీ అగ్ని మాపక అధికారి వై.హనుమంతరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్యలు...తొలుత శిక్షణపొందిన వలంటీర్ల నుంచి వందన సమర్పణను స్వీకరించారు. అనంతరం వలంటీర్లు పలు విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బహుళ అంతస్తుల్లో ప్రమాదాలు జరిగితే, అంతస్తుల్లోని క్షతగ్రతులను, వారితో పాటు ఉన్న వారిని సురక్షితంగా ఏ విధంగా కిందికి తీసుకువస్తారో విన్యాసాలతో చేసి చూపారు. పోలీసు వైర్‌లెస్ సెట్ల ద్వారా కమ్యూనికేషన్ చేయడం ప్రదర్శించారు. అగ్నిమాపక అధికారులు పౌర రక్షణ సంస్థలో యువతకు ఇస్తున్న శిక్షణను అభినందించారు. సంస్థ ఉప పౌర రక్షణ అధికారి, ఉప కలెక్టర్ కె.పద్మలత మాట్లాడుతూ, శిక్షణ పొందిన వలంటీర్ల అంతా అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రిటార్డ్ డాక్టర్ పి.రామారావు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు కమ్యూనికేషన్ శాఖ, సివిల్ డిఫెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక బస్సు

భీమునిపట్నం (రూరల్) మార్చి 19: మండలంలోని తాటితూరు గ్రామం నుంచి తగరపువలస ప్రాంతానికి రోజూ పరీక్ష రాయడానికి వచ్చే పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నుంచి ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కాగా, 40 మంది విద్యార్థులు గ్రామం నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపం మేరకు ఉదయం 7.30 తాటితూరు నుంచి వెళ్లడానికి తిరిగి పరీక్ష పూర్తయిన తర్వాత తీసుకురావడానికి వీలుగా బస్సు నడుపుతున్నారు. ఈ బస్సును మంగళవారం హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంతోషికుమారి, ఉపాధ్యాయులు ప్రసాదరావు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఈసందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూలో పుస్తకావిష్కరణ

వెంకోజీపాలెం, మార్చి 19: అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్మెంట్ ఇన్ 21 సెంచరీ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ అంశంపై ఇటీవల ఏయూ జాగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. ఇందులోని ప్రొసీడింగ్స్‌ను పుస్తక రూపంలో తీసుకువచ్చారు. దీనిని వీసీ ప్రసాదరెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఇందులో భూ శాస్త్ర ఆచార్యులు, శాస్త్రవేత్తల ప్రసంగాలను ప్రచురించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ స్టీఫెన్, హేమమాలిని సునీత, అంజు పాల్గొన్నారు.

యార్లగడ్డకు వీసీ అభినందన

వెంకోజీపాలెం, మార్చి 19: ఏయూ హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ఇంటలెక్చువల్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో లక్ష్మీ ప్రసాద్‌ని అభినందించారు.

వైసీపీ హోర్డింగ్‌ల తొలగింపు

ఆరిలోవ, మార్చి 19: మేయర్ గొలగాని హరివెంకటకుమారి క్యాంపుకార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీఎం జగన్ కటౌట్‌తో పాటు హోర్డింగ్‌లను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ఈ అంశంపై హోర్డింగ్‌ల తొలగింపుపై తాత్సారం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో జీవీఎంసీ సిబ్బంది స్పందించారు.

వలస కార్మికుల ఓట్లకు వల

మధురవాడ, మార్చి 19: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అభ్యర్థుల గెలుపు ఓటముల నిర్ణయించే వలస ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. మధురవాడ, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వలస కార్మికుల స్థిర నివాసం ఏర్పాటుచేసుకున్నాయి. వీరంతా భవన నిర్మాణ రంగంతో పాటు కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరి ఓట్లు కొల్లగొట్టేందుకు ఓ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. కుటుంబాల వారీగా ఎన్ని ఓట్లు ఉన్నాయో తమ అనుయాయులతో సర్వే చేయించారు. వీరికి తాయిలాలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి ఎలాం టి బహుమతులు అందించాలనే దానిపై ఆపార్టీ నాయకులు దృష్టి కేంద్రీకరించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో వసూళ్లు?

పద్మనాభం (రూరల్), మార్చి 19: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షల్లో మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేంద్రంలో 162 మంది పరీక్షలు రాస్తున్నారు. చాలామంది వృత్తులకు అవసరమై సర్టిఫికెట్‌కోసం పరీక్షలకు హాజరవుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు దళారుల అవతారం ఎత్తారు. ఒక్కొక్కరినుంచి రూ.300 నుంచి రూ.500 వసూలు చేసి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం కల్పిస్తున్నట్టు వినిపిస్తోంది. సొమ్ము వసూలు బాధ్యత ఓ ఉపాధ్యాయ యూనియన్ జిల్లా ప్రతినిధి ఆధ్వర్యంలో నడుస్తున్నట్టు తెలిసింది.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 144, బరబాటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 76, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర --	90
ఫారం ధర --	110
విత్ స్కిన్ --	190
స్కిన్‌లెస్ --	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..

సమస్యల తిష్ఠ... తాగునీటికి కటకట

- జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ దుస్థితి
- మొత్తం 14 బ్లాకులు, 508 ఇళ్లు
- రోజుకు గంటే కొళాయి నీరు
- ఏడాది పొడవునా నీటి కష్టాలు
- విన్నవిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం



13వ వార్డులో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ


చెత్త కుప్పల మధ్య బోరు బావి

ఆరిలోవ, మార్చి 19: జీవీఎంసీ 13వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కాలనీ వాసులు ఏడాది పొడవునా వేసవిని తలపించేలా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి ఏళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోకపోవడంతో అవస్థల మధ్య జీవనం సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని పేదలకు ప్రభుత్వం 2016లో ఇళ్ల ను మంజూరు చేసి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీని ఏర్పాటు చేసింది. అయితే కాలనీ నిర్మాణం పూర్తయిన తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. సుజల స్రవంతి పేరుతో కాలనీ వాసుల తాగునీటి కష్టాలను తీర్చేందుకు వీలుగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పథకానికి శ్రీకారం చుట్టినా, ప్రభుత్వం మారడంతో దానిని పట్టించుకోలేదు. ఇదే ప్రాంతంలోని బృదావన్‌కాలనీ వెనుక భాగంలో తాగునీటిని అందించే బోరుబావి ఉంది. దానిచుట్టూ చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తుండడంతో నీరు తీసుకువచ్చే వీలులేని దుస్థితి ఎదురవుతోంది.

కొళాయిల నుంచి అరకొర సరఫరా

ఈ ప్రాంతంలో ప్రతి 64 ఇళ్లకు ఒకటి చొప్పున జీవీఎంసీ యంత్రాంగం తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసింది. అయితే ప్రతిరోజూ కేవలం ఓ గంట మాత్రమే నీటిని సరఫరా చేస్తుండడంతో అందరికీ సరిపడా నీరు లభ్యం కావడం లేదు. ఫలితంగా నీటికోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోందంటున్నారు. అంతేకాదు కాలనీలో మౌలిక వసతులు, నిర్వహణను కూడా గాలికి వదిలేయడంతో గోడలకు పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయని, కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రతి బ్లాక్‌కు ఉచిత కొళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయాలని, ఒకపూట అంతా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రతిరోజూ వేసవే



అందరికీ వేసవిలో నీటి కష్టాలు వస్తాయి. కానీ మా కాలనీకి నిత్యం వేసవే. ఉదయం లేచింది మొదలు నీటి కోసం పాకులాడాల్సిందే. కొళాయిల ద్వారా కేవలం 15 బిందెల నీరు వస్తోంది. అవి ఎంతమందికి సరిపోతాయి. దీంతో డబ్బు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలి.

\- ఎస్‌కే ఖలీషా, కాలనీ వాసి

నిత్యం నీటి కష్టాలే



ప్రతిరోజూ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం, అన్ని కుటుంబాలకు కొళాయిల నీరు అందడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదు. ఉదయం కొళాయిల వద్దకు పరుగులు పెట్టినా, నీరు అందక ఖాళీ బిందెలతో తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

\- ఐ.జయలక్ష్మి, కాలనీ వాసి

పేరు బృందావనం.. అంతా అధ్వానం



మా కాలనీకి బృందావనం అని పేరు పెట్టారు, కనీస సదుపాయాలే లేవు. రోజుకు రెండు బిందెల నీరు దొరకడమే కష్టమవుతోంది. సుజల స్రవంతి ఎత్తి కాన్ని మంజూరు చేశారు. రెండు రూపాయలకు 20 లీటర్ల నీరిస్తామన్నారు. ప్రభుత్వం మారడంతో దానిని పక్కనపెట్టేశారు. కాలనీ డంపింగ్ యార్డులా మారింది. అధికారులు సత్వరం స్పందించాలి.

\-పంపాన సత్యవతి, కాలనీవాసి

టీడీపీ విజయంతోనే పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సుజన

మద్దిలపాలెం, మార్చి 19: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సుజన అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని మంగళవారం ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. జీవీఎంసీ 22వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకే ఓటేయాలని కోరారు. దుకాణాలు, నివాసాలకు వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. మహిళల అభివృద్ధికి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వార్డు మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, దువ్వి స్వామి, మిల్లు రాజు, పెనల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


22వ వార్డులో ప్రచారం చేస్తున్న వెలగపూడి సతీమణి సుజన, మహిళా నేతలు


ఇంటింటికీ కరపత్రాలు పంపిణీతో పాటు ప్రచారం చేస్తున్న చోడె పట్టాభిరాం

తెలుగుదేశం పేదల పక్షం

ఎంవీపీ కాలనీ: తెలుగుదేశం పేదల పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఒకటో సెక్టారులో ఇంటింటికీ వెళ్లి మంగళవారం ఆయన ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, రాజు, నరేంద్ర, వాసు, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాలలో రాణించాలి

ఆరిలోవ, మార్చి 19: మహిళలు అన్ని రంగాలలో రాణిస్తేనే ఆ కుటుంబం ముందుకు వెళ్తుందని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సెయింట్ ఆన్స్ సిస్టర్ మేరీ అన్నారు. విశాఖ మారియా కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ శక్తి స్వరూపిణి అని, అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోవాలన్నారు. కుటుంబం ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలంటే మహిళలకు ఒక స్థానం ఉండాలన్నారు. కొంతమంది భర్తలు మద్యానికి బానిసలై కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని, వారంతా మద్యం మానేసేలా తగిన మందులు ఇస్తామని ఆమె తెలిపారు. మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, వాటి నుంచి కాపాడే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మహిళలకు అన్ని వేళలా తగిన రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుమారు 400 మంది మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ విశ్రాంత ప్రిన్సిపాల్ నిర్మలా మేరీ, సిస్టర్ ఫిలోమినా జోసెఫ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


నృత్యం చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

అపార్టుమెంటులో చెలరేగిన మంటలు


అపార్ట్‌మెంట్‌లో రేగుతున్న మంటలు

ఓ ఫ్లాట్ నివాసితులు వాషింగ్ మెషిన్ ఆన్ చేసి ఊరెళ్లడంతో ప్రమాదం

పెందుర్తి, మార్చి 19: సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు గొల్లవిల్లిపాలెంలో గల ప్రశాంతి నిలయం అపార్టుమెంటులోని ఓ ఫ్లాట్‌లో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఫ్లాట్‌లో ఎవరూ లేరు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లవిల్లిపాలెంలోని అపార్టుమెంటుపై ఫ్లాట్‌లో మంటలు రావడాన్ని స్థానికులు గుర్తించి అపార్ట్‌మెంట్ నివాసితులకు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మర్రిపాలెం నుంచి అగ్నిమాపక సిబ్బంది అపార్ట్‌మెంటుకు చేరుకుని మంటలు ఇతర ఫ్లాట్లకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఆ ఫ్లాట్ బాల్కనీ స్థలంలో వాషింగ్‌మెషిన్ స్విచ్ ఆన్ చేసి రన్నింగ్‌లో ఉండడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కాగా ఆ ఫ్లాట్‌లో ఉంటున్న యజమాని కుటుంబంతో సహా రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. మంటల్లో వాషింగ్ మిషన్ దగ్ధం కావడం తప్ప ఎలాంటి ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో అపార్ట్‌మెంటువాసులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా కల్యాణ వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మహా కుంభాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, మార్చి 19: స్థానిక కృష్ణాకాలనీ వేంకటగిరిపైనున్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ద్వాదశ (పుష్కర) వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేకాభిషేకాలు జరిపారు. అనంతరం, అష్టోత్తర శత కలశాలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ శిఖరంపై భక్తులు పాలాభిషేకాన్ని జరిపారు. మధ్యాహ్నం మహానివేదన జరిగింది. సాయంత్రం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులు ఆదిమూలం నాగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎస్ఎస్ఆర్ చంద్రమూర్తి, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందరావు, నాయకులు గాడు సన్యాసినాయుడు, కె. ముత్యాలరావు, ఎచ్చర్ల హరి, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్‌వి అప్పలనరసయ్య, బాలాజీ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన కనకదుర్గమ్మ ఉత్సవాలు

కొమ్మాది: కొమ్మాది సాయిరాంకాలనీలో కనకదుర్గాదేవి జాతర మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడురోజుల ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ వేషధారణలతో కళారూపాలు, తప్పెటగుళ్ల మధ్య ఘటాల ఊరేగింపు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.


కొమ్మాది సాయిరాంకాలనీలో విచిత్ర వేషధారణలు


పొట్నూరులో చదురుగుడి వద్ద భక్తుల పూజలు

ఘనంగా పరదేశమ్మ మహోత్సవాలు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు, కృష్ణాపురంలల్లో పరదేశమ్మ అమ్మవారి పండగ మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాసంలో పండగను నిర్వహిస్తారు. ఉదయం ఘటాలను గ్రామంలో తిప్పారు. చదురుగుడి వద్ద పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లడానికి డప్పు వాయిద్యాలతో భక్తులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన రథాలను వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

'కొద్ది రోజుల్లో అరాచక పాలన అంతం'


వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

మద్దిలపాలెం, మార్చి 19: కొద్ది రోజుల్లో అరాచక పాలన కనుమరుగై కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుందని జనసేన అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు వంశీకృష్ణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన శకం ఆవిర్భావం కోసం వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వం అవసరమని భావించి టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కాగా వైసీపీ నాయకులు పైడి సత్యనారాయణ, అనిల్‌కుమార్, రామకృష్ణ, సురేష్‌కుమార్, నూకరాజు, శివ, చిన్న, చందు, వెంకటేష్ తదితరులు జనసేనలో చేరారు, దక్షిణ ఇన్‌చార్జి శివప్రసాదరెడ్డి, అనుపోజు వెంకట్ పాల్గొన్నారు.

బయోమెడికల్ రీసెర్చిపై గీతంలో అవగాహన సదస్సు

సాగర్‌నగర్, మార్చి 19: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చి ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి) పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మాస్‌స్పెక్ట్రోమెట్రి వినియోగంతో బయోమెడికల్ పరిశోధనలపై అధ్యాపకులకు అవగాహన సదస్సును మంగళవారం గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధపట్టం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన మూర్తి ప్రయోగశాలల ద్వారా ప్రపంచస్థాయి పరిశోధనలను నిర్వహించాలన్నది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డి.ఎస్.రావు మాస్ స్పెక్ట్రోమెట్రితో చేయదగిన పరిశోధనలను వివరించారు. ప్రోటీన్ కెమిస్ట్రీకి పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శర్మ మాట్లాడుతూ, బోధన,పరిశోధనలలో అధ్యాపకులకు మెరుగైన పనితీరు ప్రదర్శనలకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమానికి దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థల నుంచి శాస్త్రవేత్తలు హాజరయ్యారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) విశ్రాంత శాస్త్రవేత్త, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశిష్ట ప్రొఫెసర్ బి.వి.ఆర్‌టాటా , ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సు నాలుగురోజుల పాటు జరగనుంది.

దూర విద్య, డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు

సాగర్‌నగర్, మార్చి 19: దూర ప్రాంతాల్లో నివసిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు, వివిధ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ చదువు కొనసాగించాలనుకునే వారికి నామమాత్రం రుసుంతో డిగ్రీ, పీజీ కోర్సులను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్(సిడిఎల్) ద్వారా అందుబాటులోకి తెస్తున్నట్టు సీడీఎల్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. తొలి దశలో బీఏ, బీకామ్ డిగ్రీ కోర్సులతో పాటు ఎమ్ఏ ఇంగ్లీషులో పీజీ కోర్సుకు ఈఏడాది ప్రవేశాలను కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపుతో నిర్వహిస్తున్న ఈ కోర్సులలో ప్రవేశం పొందేవారికి ఆన్‌లైన్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పూర్తి వివరాలకు గీతం సీడీఎల్ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను మార్చి 31తేదీలోగా అందజేయాలి. మరింత సమాచారానికి దొండపర్తిలో గల సీడీఎల్ కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

ఓపెన్ స్కూల్ పరీక్షలను పరిశీలించిన డీఈఓ

పద్మనాభం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షల నిర్వహణను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పరిశీలించారు. రెండో రోజు హిందీ పరీక్షకు కేవలం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. భీమిలి డైట్ కళాశాల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా ఈ కేంద్రాన్ని పరిశీలించారు.

ఏపీ చాంబర్స్ మాజీ ప్రెసిడెంట్‌కు సత్కారం


సాంబశివరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

సిరిపురం, మార్చి 19: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ కోర్ కమిటీ మాజీ ప్రెసిడెంట్ డా.జి.సాంబశివరావును మంగళవారం పలువురు ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

వాసీవాలో పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ఆటోనగర్, మార్చి 19: విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (వాసీవా) కార్యాలయంలో మంగళవారం ఎంఎస్‌ఎంఈ లీన్ స్కీమ్‌పై పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎస్‌ఎంఈ ఏడీ చంద్రమౌళి లీన్ టెక్నిక్‌లో ఉత్పత్తి పెరుగుదల, వ్యర్థాలను తగ్గించే విధానం, బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్ స్టేజ్‌ల ఉపయోగం వివరించారు. పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పాలసీ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.